# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ నారావారిపల్లె, తిరుపతిలలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను చేశారు.

❖ అమరావతిలో పలు ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం భూ సమీకరణ జరుగుతోందని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.

❖ వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించి రాష్ట్రానికి 567 కోట్ల రూపాయల నిధులను కేంద్రం విడుదల చేసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

❖ సంక్రాంతికి నడిపే బస్సులలో అదనపు ఛార్జీలు విధించడం లేదని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

==========================

నారావారిపల్లె, తిరుపతిలలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఈ రోజు చేశారు. కోటి 4 లక్షల రూపాయలతో నిర్మించిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం, 4 కోట్ల 27 లక్షల రూపాయలతో నిర్మించిన సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సంజీవని ప్రాజెక్టులను ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. అదే విధంగా 70 లక్షల రూపాయలతో రంగంపేట - భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని కూడా ప్రారంభించారు. నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువు, మరో 4 చెరువులకు నీటిని తరలించే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారావారిపల్లెలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి అంగన్వాడీ చిన్నారులతో ముచ్చటించారు.

==========================

వైద్య ఆరోగ్య రంగానికి సంబంధించి రాష్ట్రానికి 567 కోట్ల రూపాయల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో 15వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు ఆఖరి విడత నిధులని కేంద్రం రాష్ట్రానికి అందించినట్లు అయిందని ఒక పత్రికా ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య రంగానికి 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తి స్థాయిలో సాధించిన ఘనత రాష్ట్రానికి దక్కిందని వెల్లడించారు. ఆయుష్మాన్ ఆరోగ్య

కేంద్రాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు అవసరాల మేరకు భవనాల నిర్మాణం, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపర్చడానికి, బ్లాక్ లెవల్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీల ఏర్పాటుకు ఈ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తుంది.

==========================

అమరావతిలో పలు ప్రాజెక్టులకు సంబంధించి భూ సమీకరణ జరుగుతోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతి మండలం కర్లపూడి నుంచి అనంతవరం వెళ్ళే 2.9 కిలో మీటర్ల రహదారి నిర్మాణం పనులకు మంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన అమరావతి మండలంలోని మూడు గ్రామాలలో 25 శాతం భూ సమీకరణ పూర్తయిందని వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

సంక్రాంతికి నడిపే బస్సులలో అదనపు ఛార్జీలు విధించడం లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అదే విధంగా ఈ ఏడాది ఆర్టీసీ ఛార్జీలలో ఎటువంటి పెంపుదల లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం నుండి ఈ రోజు ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ రద్దీ దృష్ట్యా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. ప్రైవేట్ బస్సులు అక్రమంగా ఛార్జీలు పెంచితే.. కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తే సంబంధిత బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని మంత్రి తెలియజేశారు.

==========================

రాష్ట్రంలో జనగణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఇన్‌ఛార్జ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. ఎస్. రావత్ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జనగణన కార్యక్రమాల అమలుపై అమరావతి నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ... ఆరు నెలల నుంచి ఏడాది పాటు జరిగే ఈ సర్వేని కాగిత రహితంగా డిజిటల్ యాప్ ద్వారా చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. పల్నాడు జిల్లాలో జనగణన కార్యక్రమాల గురించి ఆయన వివరణ కోరగా పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ కృతిక శుక్లా వివరించారు. జనగణన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.

విరామం

==========================

సంక్రాంతి పండుగ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో జరుగుతున్న సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎం.ఎస్.ఎం.ఈ. శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ రోజు తిలకించారు. లొల్లలాకుల వద్ద ఏర్పాటు చేసిన ఆత్రేయపురం ఫుడ్ ఫెస్టివల్ ను మంత్రులు సందర్శించారు. అనంతరం డ్రాగన్ పడవల పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... పకృతి రమణీయతకు పేరైన కోనసీమలో కేరళ తరహా పడవల పోటీలు నిర్వహించడం పర్యాటకంగా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. పర్యాటక అభివృద్ధితో పాటు కోనసీమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.

==========================

కాగిత రహిత విధానం (ఈ-ఆఫీస్)లో అధికారిక కార్యకలాపాలు నిర్వహించని వైద్యులు, అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఆర్జేడీ కార్యాలయాల వరకు అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ-ఆఫీస్ విధానంలోనే కొనసాగాలని స్పష్టం చేశారు. వివిధ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొత్త విధానాన్ని పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా నియమించిన రాష్ట్ర నోడల్ అధికారులు ఈ-ఆఫీస్ అమలులో అలసత్వాన్ని ప్రదర్శించే వారి గురించి తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా విడుదలైన నిధులను ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి వెంటనే ఖర్చు చేయాలని సూచించారు.

===========================

కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో ఈ రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సంక్రాంతి పండుగ సమయంలో సార్లంకపల్లెలో అగ్ని ప్రమాదం పెను విషాదం తెచ్చిందని మంత్రులు, అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వ్యాఖ్యానించారు. ఊరిలో ఉన్న మొత్తం 38 తాటాకు ఇళ్లు కాలిపోయిన ఘటనలో బాధితులకు అన్ని విధాలుగా సహాయం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని, అప్పటివరకూ వారికి అవసరమైన వసతి, ఇతర సహాయం అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

===========================

దేశాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించే రైతులకు పెద్ద ఎత్తున పంట రుణాలు అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరంలో ఈ రోజు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సుమారు 85 శాతం కౌలు రైతులు ఉన్నారని, ఆయా ప్రాంతాల్లో ఉన్న రైతులందరినీ జిల్లాలో ఉన్న 128 సహకార సంఘాలలో సభ్యులుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని తెలిపారు.

===========================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద 318 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాలలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ పథకం అయిన జల్ జీవన్ మిషన్ కింద గ్రామాలకు తాగునీటి సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు.

===========================

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్యం, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ కేంద్రం అధికారి వి. శేఖర్ తెలియచేస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

===========================
===========================